
# ప్రపంచంలో టాప్ 10 విమాన దుర్ఘటనలు



ఎక్కడ: స్పెయిన్, ఎప్పుడు: 1977 ఎలా: రన్‌వే పై రెండు విమానాలు ఢీ
మృతులు 583

ఎక్కడ: జపాన్, ఎప్పుడు: 1985 ఎలా: సాంకేతిక సమస్యతో కూలింది
మృతులు 520

ఎక్కడ: ఢిల్లీ, ఎప్పుడు: 1996 ఎలా: గాలిలో రెండు విమానాలు ఢీ
మృతులు 349

ఎక్కడ: ఫ్రాన్స్, ఎప్పుడు: 1974 ఎలా: తలుపు తెరుచుకోవడంతో పేలుడు
మృతులు 346

ఎక్కడ: ఐర్లాండ్–అట్లాంటిక్ ఓషన్, ఎప్పుడు: 1985 ఎలా: ఖలిస్థాన్ ఉగ్రవాదుల బాంబుదాడి
మృతులు 329

ఎక్కడ: ఇరాన్, ఎప్పుడు: 2003 ఎలా: బలమైన గాలుల వల్ల
మృతులు 275

ఎక్కడ: ఇరాన్, ఎప్పుడు: 1988 ఎలా: అమెరికా క్షిపణి దాడివల్ల
మృతులు 290

ఎక్కడ: అమెరికా, ఎప్పుడు: 1979 ఎలా: ఇంజిన్‌లో తలెత్తిన లోపం
మృతులు 273

ఎక్కడ: ఉక్రెయిన్, ఎప్పుడు: 2014 ఎలా: క్షిపణి ఢీకొట్టడంతో..
మృతులు 298

ఎక్కడ: సౌదీ అరేబియా, ఎప్పుడు: 1980 ఎలా: విమానంలో మంటలు
మృతులు 301

## ఎక్కువ ప్రమాదాలు అప్పుడే..!

చరిత్రలో ఇప్పటివరకూ జరిగిన విమాన ప్రమాదాలను విశ్లేషిస్తే, ఎక్కువ ప్రమాదాలు టేకాఫ్, ల్యాండింగ్ సమయంలోనే జరిగినట్టు నిపుణులు చెప్తున్నారు. గత ఏడాది చిన్నవి పెద్దవి కలిపి మొత్తంగా 1,468 విమాన ప్రమాదాలు జరిగితే అందులో 770 ప్రమాదాలు ల్యాండింగ్ సమయంలో, 124 ప్రమాదాలు టేకాఫ్ సమయంలో జరిగినట్టు గుర్తు చేస్తున్నారు. టేకాఫ్ లేదా ల్యాండింగ్ సమయాల్లో భూమికి దగ్గరగా ప్లేన్ ఉంటుంది. ఇంజిన్‌లో సమస్య, టెక్నికల్ ఎర్రర్స్ ఏమైనా తలెత్తితే వాటిని అంచనా వేసి, సరిచేయడానికి పైలట్‌కు ఇప్పుడు తగిన సమయం ఉండదు. దీంతో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుంది. అలాగే, టేకాఫ్–ల్యాండింగ్ సమయాల్లో విమాన వేగంలో మార్పులు, వాతావరణ పరిస్థితులు, రన్‌వేను సరిగ్గా అంచనా వేయడం వంటివి ఎంతో ముఖ్యం. ఇందులో ఏ మాత్రం పొరపాటు జరిగినా ప్రమాదానికి దానితీయొచ్చని నిపుణులు చెప్తున్నారు. టేకాఫ్ సమయాల్లో ఇంజిన్‌పై ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని కూడా గుర్తు చేస్తున్నారు. విమానం టేకాఫ్ లేదా ల్యాండింగ్ సమయాల్లో పక్షులను ఢీకొనే ఛాన్సెస్ కూడా ఎక్కువగా ఉంటుందని, దీంతో ప్రమాదాల సంభావ్యత కూడాపెరుగుతున్నట్టు చెప్తున్నారు.

**అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో పైలట్లు ఎవరు? వాళ్ల అనుభవమేంటీ?**

ప్రధాన పైలట్: సుమిత్ సభర్వాల్ (8200 ఫ్లైయింగ్ అవర్స్)

కోపైలట్: క్లైవ్ కుందర్ (1100 ఫ్లైయింగ్ అవర్స్)



మృత్యుంజయుడు రమేశ్ ఎయిరిండియా టికెట్

# మృత్యుంజయుడు

మొదటిపేజీ తరువాయి...

రమేశ్ విమానంలో 11ఏ సీటులో కూర్చున్నారు. ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్ వెనుక ఈ సీటు ఉంటుంది. తన కుటుంబాన్ని కలిసేందుకు భారత్‌కు వచ్చిన రమేశ్ తన సోదరుడు అజయ్ కుమార్ రమేశ్(45)తో కలసి లండన్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. విమానంలోని 11ఏ సీటులో కూర్చున్న రమేశ్ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక ప్రయాణికుడు. అసర్వాలోని ప్రభుత్వ దవాఖాన జనరల్ వార్డులో చికిత్స పొందుతున్న రమేశ్‌ను మీడియా పలకరించగా తాను ఘోరమైన ప్రమాదం నుంచి తప్పించుకున్నానని చెప్పారు. "టేకాఫ్ అయిన 30 సెకండ్లకే భారీ శబ్దం వినిపించింది. అంతలోనే విమానం కూలిపోయింది. అంతా క్షణాలలో జరిగిపోయింది" అని రమేశ్ చెప్పారు. రమేశ్‌కు ఛాతీ, కళ్లు, కాళ్లకు బలమైన దెబ్బలు తగిలాయి. అంతకుముందు, విమానం కూలిపోయి దగ్ధమవుతుండగా గాయపడిన రమేశ్ అంబులెన్సు వైపు నడుచుకుంటూ వస్తున్న దృశ్యాలు ఓ వీడియోలో కనిపించాయి. విమానంలో ఇతర ప్రయాణికుల పరిస్థితి గురించి స్థానికులు రమేశ్‌ను అడగడం కనిపించింది. విమానం పేలిపోయింది అని గుజరాతీలో రమేశ్ చెప్పడం వినిపించింది. ఇతర ప్రయాణికుల గురించి అడిగిన ప్రశ్నకు వారంతా అక్కడ (ప్రమాద స్థలిలో) ఉన్నారు అని రమేశ్ చెప్పారు. విమాన ప్రమాదంలో ఒకే ఒక్క ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడ్డారని అహ్మదాబాద్ పోలీసు కమిషనర్ జీఎస్ మాలిక్ తెలిపారు. 11ఏ సీటులో సజీవంగా ఉన్న ఓ ప్రయాణికుడిని పోలీసులు గుర్తించారు. ఆ ప్రయాణికుడు దవాఖానలో చికిత్స పొందుతున్నారని, మృతుల సంఖ్య గురించి ఇప్పుడే తాను చెప్పలేనని మాలిక్ అన్నారు.

### 11ఏ సీటు ప్రత్యేకతలు

ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787–8(డ్రీమ్‌లైనర్స్)లో 11ఏ సీటు ఎకానమీ క్లాస్ క్యాబిన్‌కు చెందిన మొదటి వరుసలో ఉంటుంది. బిజినెస్ క్లాస్‌కి వెనుక ఉంటుంది. క్యాబిన్‌కి అభిముఖంగా కూర్చుని చూస్తే ఎడమ వైపున 11ఏ సీటు ఉంటుంది. విమానం రెక్కలు ఉండే ప్రదేశానికి రెండు వరుసల ముందు ఈ విండో సీటు ఉంటుంది. ప్రమాద సమయాలలో సురక్షిత సీటుగా పరిగణించే 11ఏ సీటు ఎమర్జెన్సీ డోర్‌కు వెనుకనే ఉంటుంది.



ప్రమాదం గురించి తెలియగానే రోదిస్తున్న ఓ ప్రయాణికుడి బంధువులు

## విమానంలో భారీగా ఇంధనం: అమిత్‌షా

అహ్మదాబాద్, జూన్ 12: ఇంధనం మండుతున్న కారణంగా.. కూలిపోయిన ఎయిరిండియా విమానంలో ఉష్ణోగ్రత చాలా ఎక్కువగా ఉన్నందున ఎవరినీ రక్షించే అవకాశం లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉందని, దాని వల్ల విమానంలో అత్యధికంగా ఉష్ణోగ్రత ఉన్నందు వల్ల ఏ ఒక్క ప్రయాణికుడినీ రక్షించడం సాధ్యం కాదని గురువారం నాడిక్కడ ఆయన చెప్పారు. ఈ విషాద ఘటనతో యావత్ దేశం దిగ్భ్రాంతిలో మునిగిపోయిందని అమిత్ షా అన్నారు. డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి మృతులను గుర్తించిన తర్వాత మృతుల సంఖ్యను అధికారులు ప్రకటిస్తారని ఆయన చెప్పారు. ఈ ప్రమాదంలో ఒకే ఒక్క వ్యక్తి బతకడం మంచి వార్తని, ఆయనను కలుసుకుని ఇక్కడకు వచ్చానని అమిత్ షా చెప్పారు.

## 'మేడేకాల్' ఇచ్చారు.. అంతలోనే..!

విమానం కూలిపోయే ముందు పైలట్ల నుంచి ఏటీసీకి (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్) 'మేడే కాల్' వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఆ కాల్‌ను రిసీవ్ చేసుకొన్న ఏటీసీ బృందం తిరిగి పైలట్లను సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ అటు నుంచి ఎలాంటి సమాధానం రాలేదని పేర్కొన్నారు. ఇది జరిగిన సెకండ్ల వ్యవధిలోనే ఎయిర్‌పోర్టు సమీపంలో విమానం కూలిపోయి దట్టమైన పొగలు వ్యాపించినట్టు తెలిపారు.




### 'మేడే కాల్' అంటే ఏమిటీ?

'మేడే కాల్' అనేది డిస్ట్రెస్ కాల్. అత్యవసర పరిస్థితుల్లో విమానాల్లో, నౌకల్లో దీన్ని వాడుతారు. తాము అత్యవసర ప్రమాద స్థితిలో చిక్కుకొన్నామని, వెంటనే సాయం కావాలని రేడియో కమ్యూనికేషన్ ద్వారా సంబంధిత అధికారులకు పైలట్లు తెలియజేయడానికి ఇది సాయపడుతుంది. ఎమర్జెన్సీ సమయాల్లో మేడే అనే పదాన్ని పైలట్లు మూడుసార్లు వాడుతారని నిపుణులు గుర్తు చేస్తున్నారు. మైడెర్ అనే ఫ్రెంచ్ పదం నుంచి మేడే అనే పదం వచ్చిందని, దీనికి సాయం చేయండి అని అర్థం అని వాళ్లు చెప్తున్నారు.

## గుట్టు అంతా బ్లాక్‌బాక్స్‌లోనే.. ఏమిటిదీ?




ఎయిరిండియా విమాన ప్రమాదం ఇలా జరిగి ఉండొచ్చు, అలా జరిగి ఉండొచ్చు అంటూ పలు ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ, ప్రమాదానికి గల అసలు కారణం మాత్రం ఇంకా బయటకురాలేదు. ఎయిర్‌క్రాఫ్ట్‌లోని బ్లాక్‌బాక్స్ బయటపడితేనే ప్రమాదానికి గల అసలు కారణం తెలుస్తుందని నిపుణులు చెప్తున్నారు. దీంతో ఏమిటీ బ్లాక్‌బాక్స్ అన్న చర్చ మొదలైంది. ప్రమాదానికి ముందు విమానంలో జరిగే సంఘటనలను రికార్డ్ చేసేదే బ్లాక్‌బాక్స్. సాధారణంగా ప్రతీ విమానాల్లో రెండు బ్లాక్‌బాక్స్‌లు ఉంటాయి. ఒకటి కాక్‌పిట్ వాయిస్ రికార్డర్, రెండోది ఫ్లైట్ డాటా రికార్డర్. విమానం కూలిపోయినా, కాలిపోయినా, నీటిలో మునిగిపోయినా బ్లాక్‌బాక్స్‌కు ఏమీకాకుండా దీన్ని ధృడమైన స్టీల్ లేదా టైటానియంతో తయారు చేస్తారు.

కాన్ఫిగరేషన్‌ను బట్టి 290 మంది ప్రయాణించే వీలు

# డ్రీమ్‌లైనర్.. ప్రత్యేకం

## నాన్‌స్టాప్‌గా 13వేల కి.మీ ప్రయాణించగలదు!

## సాధారణ విమానాలతో పోల్చితే డ్రీమ్‌లైనర్ తేలికైనది



న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌లోని గట్విక్ విమానాశ్రయానికి బయలుదేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ 787–8 డ్రీమ్ లైనర్ విమానం టేకాఫ్ అయిన కాసేపటికే కుప్పకూలింది. దీంతో డ్రీమ్‌లైనర్ విమానంపై మరోసారి చర్చ మొదలైంది. బోయింగ్ 787–8డ్రీమ్ లైనర్ అనేది అత్యాధునిక, సుదూర, వైట్‌బాడీ మోడల్ విమానం. సామర్థ్యం, సౌకర్యం, పర్యావరణ హితంగా దీనిని రూపొందించారు. బోయింగ్ డ్రీమ్ లైనర్ సిరీస్‌లో మొదటి మోడల్ 2011లో అందుబాటులోకి వచ్చింది. ఖండాంతర ప్రయాణాల కోసం దీనిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఎయిర్‌లైన్ కాన్ఫిగరేషన్‌ను బట్టి డ్రీమ్‌లైనర్‌లో 242 నుంచి 290 మంది వరకు ప్రయాణించవచ్చు. నాన్‌స్టాప్‌గా 13,530 కిలోమీటర్లు ప్రయాణించగలిగే సామర్థ్యం దీని సొంతం. కాబట్టి ప్రధాన నగరాల మధ్య నాన్‌స్టాప్ ప్రయాణాలకు డ్రీమ్‌లైనర్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. విమాన ప్రాథమిక నిర్మాణంలో 50 శాతానికిపైగా కార్బన్ ఫైబర్ మిశ్రమాలను ఉపయోగించారు. ఫలితంగా విమానం తేలికగా ఉండి ఇంధనాన్ని సమర్థంగా వినియోగించుకుంటుంది. తాజా ఏవియానిక్స్, ఫ్లైబై వైర్ కంట్రోల్స్, అత్యాధునిక భద్రతా వ్యవస్థలను ఇందులో ఉపయోగించారు. బోయింగ్ 787–8 డ్రీమ్ లైనర్‌లో అత్యాధునిక నేవిగేషన్, భద్రతా వ్యవస్థలు ఉండటంతో పరిస్థితులపై అవగాహన, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి.

### తొలిసారి భారీ ప్రమాదం

పటిష్ఠమైన బాడీతో అత్యధికంగా అమ్ముడవుతూ 14 ఏండ్ల నుంచి వాడుకలో ఉన్న బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్‌కు ఇంత భారీ స్థాయిలో ప్రమాదం చోటుచేసుకోవడం ఇదే తొలిసారి. ప్రమాదానికి గురైన బోయింగ్ విమానం 11.5 సంవత్సరాల క్రితంది. ఇప్పటివరకు 41 వేల గంటలకు పైగా ప్రయాణించిందని విమానయాన అధికారులు తెలిపారు. గురువారం కూలిపోయిన బోయింగ్ 787–8 ఎయిరిండియా నడుపుతున్న లెగసీ విమానాలలో ఒకటి. ప్రస్తుతం మన దేశంలో ఎయిరిండియా, ఇండిగో వైమానిక సంస్థలు మాత్రమే బీ787 విమానాలను నడుపుతున్నాయి. ప్రపంచంలో తొలిసారిగా అలహాబాద్ ప్రమాదంలో బోయింగ్ 787 పూర్తి స్థాయిలో ధ్వంసమైందని ఒక అధికారి చెప్పారు.

## వందలమంది చనిపోతారు!

**డ్రీమ్‌లైనర్ నాణ్యతా లోపాలపై ముందే హెచ్చరించిన విజిల్ బ్లోయర్**

డ్రీమ్ లైనర్ విమానాల్లోని నాణ్యతా సమస్యలను పరిష్కరించకుంటే వందలమంది చనిపోయే ప్రమాదం ఉన్నదని ఏడాది క్రితమే యూఎస్ కాంగ్రెస్‌ను విజిల్ బ్లోయర్ ఒకరు హెచ్చరించారు. బోయింగ్ ఇంజినీర్, విజిల్‌బ్లోయర్ అయిన శామ్ సలేపూర్ గతంలో పలు పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో మాట్లాడుతూ బోయింగ్ 777, 787 డ్రీమ్ లైనర్ మోడళ్ల నిర్మాణంలో నాణ్యత లోపించిందని, దీనివల్ల దీర్ఘకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కాబట్టి ఈ విమానాల తయారీని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అయితే, ఈ ఆరోపణలను బోయింగ్ కొట్టిపారేసింది. దశాబ్దానికిపైగా బోయింగ్‌లో పనిచేసిన సలేపూర్.. 787 డ్రీమ్‌లైనర్‌లోని కీలక విభాగాల మధ్య ఒక సమస్యను గుర్తించానని, ఇది సర్వీసులో ఉన్న వెయ్యికిపైగా జెట్‌లను ప్రభావితం చేస్తుందని హెచ్చరించారు.

# తెరపైకి జాన్ బార్నెట్!

**అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన బోయింగ్ విజిల్‌బ్లోయర్**



న్యూఢిల్లీ: 242 మందితో అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం ఏఐ171 బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ కుప్పకూలి పెను విషాదాన్ని మిగిల్చింది. అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మరణించిన బోయింగ్ విజిల్ బ్లోయర్ జాన్ బార్నెట్‌ను ఈ ప్రమాదం మరోమారు గుర్తుకు తెచ్చింది. విమానం ఉత్పత్తి ప్రమాణాలను ఆధారాలతో సహ ప్రశ్నించిన ఆయన బోయింగ్‌పై దావా కూడా వేశారు. బార్నెట్ బోయింగ్‌లో క్వాలిటీ మేనేజర్‌గా పనిచేశారు. నిరుడు మార్చి 9న సౌత్ కరోలినాలోని చార్లెస్టన్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. 62 ఏళ్ల బార్నెట్ తుపాకితో కాల్చుకుని మరణించినట్టు పోలీసులు ఆ తర్వాత నిర్ధారించారు. ఘటనా స్థలం నుంచి నోట్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. అయితే, విజిల్ బ్లోయర్‌గా బోయింగ్‌పై దావా వేయడం, ఆ తర్వాత ఆయన మృతి చెందడంతో ఆయన మరణంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. మూడు దశాబ్దాలకు పైగా తన జీవితాన్ని బోయింగ్‌కు అంకితం చేసిన బార్నెట్ నార్త్ చార్లెస్టన్ ఫెసిలిటీలో 2010 నుంచి క్వాలిటీ మేనేజర్‌గా పనిచేశారు. ఈ క్రమంలో విమాన ఉత్పత్తిలో భద్రతపై పలుమార్లు ఆందోళన వ్యక్తంచేశారు. మరీ ముఖ్యంగా 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో భద్రతను ప్రశ్నిస్తూ తయారీలో లోపాలను ఎత్తిచూపారు. 2017లో ఆరోగ్య కారణాలతో రిటైరయ్యారు. అయినప్పటికీ బోయింగ్‌పై దావాను కొనసాగించారు.

### నాసిరకం విడిభాగాలు వాడమన్నారు

2019లో ఓ ఇంటర్వ్యూలో బార్నెట్ మాట్లాడుతూ బోయింగ్ విమానాల డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో నాసిరకం పరికరాలను బిగించాలంటూ కార్మికులపై సంస్థ ఒత్తిడి తెచ్చినట్టు ఆరోపించారు. అవన్నీ స్క్రాప్‌బిన్(చెత్తకుప్ప) నుంచి తెచ్చినవేనని అన్నారు. వాటిని తీసుకొచ్చి బలవంతంగా తమతో విమానానికి బిగించేలా చేశారని ఆరోపించారు. అంతేకాదు, బోయింగ్ 787లో 25 శాతం ఎమర్జెన్సీ ఆక్సిజన్ సిస్టం ఫెయిలయ్యే అవకాశం ఉందని సంచలన ఆరోపణలు చేశారు. బార్నెట్ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన యూఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) 2017లో బోయింగ్ ఫెసిలిటీలో రివ్యూ చేసింది. ఈ సందర్భంగా నాణ్యతకు అనుగుణంగా లేని 53 విడిభాగాల జాడ కనిపించడం లేదని పేర్కొంది. ఈ తప్పును సరిచేసుకోవాలని బోయింగ్‌ను ఆదేశించింది.



## పిల్లలతో డాక్టర్ దంపతుల చిట్టచివరి సెల్ఫీ

డాక్టర్ ప్రతీక్ జోషీ, డాక్టర్ కోమీ వ్యాస్ దంపతులు తమ ముగ్గురు పిల్లలతో ఎయిరిండియా విమానంలో తీసుకున్న సెల్ఫీ వారి కుటుంబాల్లో అత్యంత విషాదకర ఘట్టంగా చిరకాలం నిలిచిపోతుంది. ఈ దంపతులు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఓ దవాఖానలో పని చేసేవారు. డాక్టర్ ప్రతీక్‌కు లండన్‌లో ఉద్యోగం రావడంతో, ఆమె తన ఉద్యోగానికి రాజీనామా చేసి, లండన్‌లో భర్తతో కలిసి జీవించాలనుకున్నారు. ఆమెను, పిల్లలను లండన్‌కు తీసుకెళ్లేందుకు డాక్టర్ ప్రతీక్ రెండు రోజుల క్రితమే ఇక్కడికి వచ్చారు. వీరంతా కలిసి బుధవారం అహ్మదాబాద్‌కు బయల్దేరారు. ఐదేళ్ల వయసుగల కుమారులు నకుల్, ప్రద్యుత్, కుమార్తె ఎనిమిదేళ్ల మిరయ చిరునవ్వులు చిందిస్తూ తీసుకున్న సెల్ఫీ వైరల్ అయింది.

## కాపాడిన ట్రాఫిక్ జామ్

తీవ్ర ట్రాఫిక్ జామే ఆ మహిళ ప్రాణాలను ఘోర విమాన ప్రమాదం నుంచి కాపాడింది. తాను అహ్మదాబాద్ విమానం ఎక్కేందుకు వస్తుండగా, ట్రాఫిక్ జామ్ కారణంగా చిక్కుకుపోయి 10 నిమిషాలు ఆలస్యంగా విమానాశ్రయానికి వచ్చానని, దీంతో విమానం మిస్సయినట్టు భూమీ చౌహాన్ అనే మహిళ తెలిపారు. అదే తన ప్రాణాలను కాపాడిందని, ప్రమాదం గురించి తెలిసి తీవ్రంగా వణికిపోయానని చెప్పారు. కనీసం నోటి మాట కూడా రావడం లేదని తెలిపారు.

## మొదటి సారి భర్తను కలుసుకోవడానికి వెళ్తూ!

**విమాన ప్రమాదంలో నవ వధువు మృతి**

అహ్మదాబాద్: అహ్మదాబాద్ విమాన ప్రమాదం ఎందరో ఆశలు, ఆశయాలను విచ్ఛిన్నం చేయడమే కాక, పలువురి కలలను కల్లలు చేసింది. ప్రమాద మృతులలో వివాహమైన తర్వాత మొదటిసారి భర్తను కలుసుకోవడానికి వెళ్తున్న ఒక నవ వధువు కూడా ఉంది. రాజస్థాన్ బలోతరా జిల్లాకు చెందిన అరబా గ్రామానికి చెందిన ఖుష్బూ ఈ ప్రమాదంలో మరణించింది. ఈ ఏడాది జనవరిలో ఆమెకు మన్ఫూల్ సింగ్‌తో వివాహమైంది. అతను లండన్‌లో చదువుకుంటున్నాడు. దీంతో వివాహమైన తర్వాత తొలిసారిగా భర్తను కలుసుకోవడానికి ఈ విమానంలో లండన్ వెళ్తూ ప్రమాదంలో మరణించింది. ఈ ప్రమాద మృతులలో చెఫ్‌గా పనిచేయడానికి వెళ్తున్న ఇద్దరు, ఓ వ్యాపారి కుమారుడు, కుమార్తె కూడా ఉన్నారు.



### ఇది హృదయ విదారక విపత్తు: రాష్ట్రపతి



అహ్మదాబాద్ విమాన ప్రమాదం హృదయ విదారక విపత్తుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ వర్ణించలేని దుఃఖ సమయంలో బాధితులకు దేశం అండగా నిలుస్తుందని ఆమె అన్నారు. ఈ విషాద ఘటన తనలో తీవ్ర దుఃఖాన్ని నింపిందని ఆమె ఎక్స్‌లో తెలిపారు. 'ఇది హృదయ విదారకమైన విపత్తు. నా ఆలోచనలు, ప్రార్థనలు బాధిత ప్రజలతో ఉన్నాయి. వర్ణించ లేని ఈ దుఃఖ సమయంలో దేశం వారికి తోడుగా నిలుస్తుంది' అని ఆమె సంతాపం వ్యక్తం చేశారు.

### ప్రమాదం తీవ్ర విచారకరం: ప్రధాని మోదీ

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ దీనిని హృదయ విదారక విషాదంగా అభివర్ణించారు. ఈ ప్రమాదంలో బాధితులకు సహాయం అందించేందుకు అధికారులతో టచ్‌లో ఉంటున్నట్టు చెప్పారు. వెంటనే అహ్మదాబాద్‌కు వెళ్లి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఘోర విమాన ప్రమాదంపై సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, ఇతర న్యాయమూర్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

### బ్రిటన్ ప్రధాని విచారం

ప్రమాదంపై బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చాలా మంది బ్రిటిష్ జాతీయులతో లండన్ వస్తూ అహ్మదాబాద్‌లో విమానం కూలిపోతున్న దృశ్యాలు హృదయ విదారకమైనవని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. 'పరిస్థితి తీవ్రతపై ఎప్పటికప్పుడు నాకు సమాచారం అందుతున్నది. తీవ్రమైన ఈ బాధాకర సమయంలో నా ఆలోచనలు ప్రయాణికులు, వారి కుటుంబాలతో ఉన్నాయి' అని ఆయన పేర్కొన్నారు.

### అవసరమైన సాయం అందిస్తాం: బోయింగ్

తమ విమానం ఘోర ప్రమాదానికి గురి కావడంపై అమెరికాకు చెందిన విమాన తయారీ సంస్థ బోయింగ్ స్పందించింది. లండన్ వస్తున్న తమ బోయింగ్ విమానం ప్రమాదానికి గురైన సమాచారం అందిన వెంటనే అహ్మదాబాద్ విమానాశ్రయాన్ని సంప్రదించినట్టు తెలిపింది. అవసరమైన సహకారాన్ని, సహాయాన్ని ఎయిర్ ఇండియాకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. 'మా ఆలోచనలు ప్రయాణికులు, సిబ్బంది, ప్రథమ స్పందనదారులు, ప్రభావితమైన వారందరితో ఉన్నాయి' అని బోయింగ్ ఆ ప్రకటనలో తెలిపింది.

### దుర్ఘటన కలిచివేసింది: కేటీఆర్

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. లండన్ వెళుతున్న విమానం జనావాసాలపై కుప్పకూలడం తనను ఎంతగానో కలచివేసిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదంలో ప్రయాణికులు, స్థానికులు, మెడికోలు మరణించడం దురదృష్టకరమని అన్నారు. మృతుల ఆత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు. ఈ దుఃఖ సమయంలో బాధిత కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని కోరుకున్నట్టు పేర్కొన్నారు.

### మృతులకు ఘన నివాళి: హరీశ్‌రావు

ఎయిర్ ఇండియా విమానం కూలిన ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి గురువారం ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

### విమాన ప్రమాదంపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తంచేశారు. ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### మెడికోల మరణం బాధాకరం: ఎంపీ వద్దిరాజు

అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో సామాన్యులు, ఉజ్వల భవిష్యత్తు కలిగిన మెడికోలు మరణించడం బాధాకరమని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. వారి ఆత్మలకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తిచేశారు.

### అండగా నిలవాలి: బండ ప్రకాశ్

అహ్మదాబాద్ విమాన దుర్ఘటనలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ఆకాంక్షించారు. ప్రమాదంలో మెడికల్ కాలేజీ విద్యార్థులు మరణించడం తనను కలిచివేసిందని చెప్పారు.

### విచారకరం: మధుసూదనాచారి

విమాన ప్రమాదం విచారకరమని మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి పేర్కొన్నారు. ఈ దుర్ఘటన తనను ఎంతగానో కలచివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. మృతులకు సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలువాలని ప్రభుత్వాలను కోరారు.

### విద్యార్థుల మరణం బాధాకరం: నామా

విమాన దుర్ఘటనలో మెడికల్ కాలేజీ విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. మృతులకు ఘనంగా నివాళుర్పించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

### ఘటన దురదృష్టకరం: మాజీ ఎంపీ వినోద్

విమాన ప్రమాదం దురదృష్టకరమని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. వైద్యవిద్యార్థులు, అమాయకులు ప్రాణాలు కోల్పోవడం ఎంతగానో బాధించిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.